సాక్షి
పార్వతీపురం మన్యం



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

స్థల పరిశీలన



కలెక్టరేట్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: అడ్డాపుశీలలో సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి గతంలో కేటాయించిన 59.80 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి బుధవారం పరిశీలించారు. కలెక్టరేట్ ఏర్పాటుకు అనుకూలతలపై ఆరా తీశారు. ఆయన వెంట జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం తహసీల్దార్ సురేష్, ఇతర అధికారులు ఉన్నారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



మహిషాసుర మర్దిని రూపంలో కోటదుర్గమ్మ

పాలకొండ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహిషాసుర మర్దినిగా కోటదుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. గురువారం అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమివ్వనున్నారు. సాయంత్రం అమ్మవారి తిరువీధికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉల్లిభద్రలో పింఛన్ల పంపిణీ



ఉల్లిభద్రలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రభాకర రెడ్డి

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి దివ్యాంగులు, వృద్ధులకు బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 1,40,066 మందికి ప్రతి నెలా రూ.60 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి ఉన్నారు.

విజయాలకు నాంది కావాలి



మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: విజయదశమి ప్రతి ఒక్కరి విజయాలకు, ప్రగతికి నాంది కావాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలందరికీ ఆయన బుధవారం ఓ ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుమీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకొనే దసరా పండగ, మనందరి జీవితాల్లో సుఖ సంతోషాలకు, విజయాలకు పునాది వేయాలని ఆకాంక్షించారు. దుర్గామాత అందరినీ చల్లగా చూడాలని, సంపూర్ణ శక్తినివ్వాలన్నారు. నవ దుర్గల స్ఫూర్తిగా ప్రతిమహిళా అభివృద్ధివైపు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

గిరిజన గురుకులంలో చావుకేకలు

- కురుపాం గురుకులంలో రాలిన మరో గిరిజన విద్యాకుసుమం
- వారంలో రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- గిరిజన సంక్షేమశాఖ నిర్లక్ష్యమే కారణమంటున్న గిరిజన సంఘాలు
- తాగునీరు కలుషితంతో పచ్చకామెర్ల బారిన విద్యార్థులు
- స్పందించని మంత్రి
- కురుపాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించిన మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి



కురుపాంలోని బాలికల గురుకుల పాఠశాల/కళాశాల



కురుపాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్య మంత్రి పుష్పశ్రీవాణి



అనారోగ్యంతో వారం రోజుల కిందట మృతి చెందిన పి.అంజలి(ఫైల్)

కురుపాం: గిరిజన గురుకులంలో వినిపిస్తున్న చావుకేకలు విద్యార్థిలోకాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. కురుపాం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని తోయక కల్పన (15) అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఇదే పాఠశాలలో చదుతున్న గుమ్మలక్ష్మీపురం మండలం కంబగూడకు చెందిన అంజలి అనే బాలిక వారం రోజుల కిందట మృతిచెందింది. దీంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాలలో సదుపాయాలు లేకపోవడం, స్వచ్ఛమైన తాగునీరు అందకపోవడం, బాలికలకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 611 మంది విద్యార్థినులు చదుతున్న గురుకులానికి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందని, జిల్లాకు చెందిన మంత్రి సంధ్యారాణి కనీసం పట్టించుకోవడంలేదంటూ గిరిజన సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు.

పచ్చకామెర్ల బారిన విద్యార్థినులు

వసతి గృహంలో కలుషిత తాగునీరు కారణంగా విద్యార్థులు జ్వరాలు, పచ్చకామెర్లు బారిన పడుతున్నారు. వారంలో ఇద్దరు మృత్యువాత పడడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాఠశాలకు చెందిన 50 మంది బాలికలను కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. వైద్య పరీక్షలు చేశారు. నీరజ అనే బాలికను కేజీహెచ్‌కు తరలించారు. మరికొంత మంది బాలికలు జియ్యమ్మవలస మండలం రామభద్రపురం, చినమేరంగి పీహెచ్‌సీల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరాల వ్యాప్తిపై గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ పి.అనూరాధ మాట్లాడుతూ పాఠశాలలో కొద్ది రోజులుగా ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయడం లేదని, బాలికలకు ప్రత్యమ్నాయంగా వేడినీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. జ్వరాల బారిన పడిన వారిని కురుపాం సీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కొందరు విద్యార్థినులు దసరా సెలవుల్లోనూ ఆస్పత్రిలోనే వైద్యసేవలు పొందుతుండడం గమనార్హం.

గిరిజనుల విద్య, వైద్యంపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్య మంత్రి పుష్పశ్రీవాణి

గిరిజనులకు మెరుగైన వైద్యం, విద్యా సౌకర్యాల కల్పనలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, దీనికి వారం రోజుల్లో కురుపాం బాలిక గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినుల మృతే నిలువెత్తు నిదర్శనమని మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి అన్నారు. బాలికలు అనారోగ్యంతో మృతిచెందుతున్నా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి స్పందించక పోవడం ఘోరమన్నారు. కురుపాం సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న బాలికలను పరామర్శించిన అనంతరం కురుపాం గురుకుల పాఠశాల/కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడారు. పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులకు గురైందన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంకా ఎంత మంది బాలికలు అనారోగ్యంబారిన పడతారోనని ఆవేదన వ్యక్తంచేశారు. కురుపాం సీహెచ్‌సీలో సేవలు పొందుతున్న 50 మందిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారన్నారు.

గిరిజన బాలికలకు భద్రత కరువు

గిరిజన ఆడపిల్లలకు భద్రత కరువైందని పుష్పశ్రీవాణి ఆవేదన వ్యక్తంచేశారు. బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిని సస్పెండ్ చేసి మళ్లీ రూ.లక్షల్లో లంచం తీసుకుని తిరిగి పోస్టింగ్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై గిరిజనులకు ఏం చెప్పదలచుకుంటున్నారో..? కూటమి నాయకులు, ఐటీడీఏ అధికారులు ఆలోచించాలన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ముందు జాగ్రత్త వహిస్తే ఇద్దరు బాలికలు మృతి చెందేవారే కాదన్నారు.

బాలికలను పరామర్శించిన పుష్పశ్రీవాణి

వారం రోజుల్లో ఇద్దరు బాలికలు మృత్యువాత పడడం, 50 మంది విద్యార్థినులను వైద్య పరీక్షల కోసం కురుపాం సీహెచ్‌సీకి తరలించిన విషయం తెలుసుకున్న మాజీ ఉపముఖ్య మంత్రి పుష్పశ్రీవాణి సీహెచ్‌సీకి వెళ్లి పరామర్శించారు. వైద్యసేవలు పొందుతున్న విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. చికిత్స అందిస్తున్న వైద్యాధికారి వాసును బాలికల మరణం, జ్వరాల వ్యాప్తికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు నిషార్, శెట్టి నాగేశ్వరరావు, ఆదిల్ ఉన్నారు.

బొబ్బిలికి స్వచ్ఛాంధ్ర అవార్డు



కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: దశాబ్ద కాలంగా ఇంటింటి చెత్త సేకరణ, ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో బొబ్బిలి మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిచి స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైంది. ఈ విషయమై కమిషనర్ ఎల్.రామలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర అవార్డు రావడం సంతోషంగా ఉందని, బొబ్బిలిలో పారిశుద్ధ్య నిర్వహణకు సహకరిస్తున్న ప్రజలందరికీ అవార్డు ఫలాలు అందిస్తామన్నారు.

నేడు మాంసాహార విక్రయాలు నిషేధం

విజయనగరం: అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాంసం విక్రయాలు బంద్ చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ప్రకటించారు. పశువధలుగాని, మాంసం విక్రయాలుగాని చేయరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

వైద్యుడి కుర్చీలో తహసీల్దార్

- తీవ్రంగా ఖండిస్తున్న పీహెచ్‌సీ వైద్యుల సంఘం



పార్వతీపురం మండలంలో వైద్యాధికారి కుర్చీలో కూర్చుని వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

పార్వతీపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు నిరసనలు చేస్తున్న వేళ, పార్వతీపురం తహసీల్దార్ సురేష్ ఓ పీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారి కుర్చీలో కూర్చోవడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాయింట్ కలెక్టర్ స్థాయి కన్నా తక్కువ హోదా అధికారులు పీహెచ్‌సీలను తనిఖీ చేయరాదని, ఈ నేపథ్యంలో తహసీల్దార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కుర్చీలో కూర్చునే చర్య తమ వృత్తిని అగౌరవపరిచేలా ఉందని ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ వైద్యుల సంఘం తీవ్రంగా ఖండించింది. రెవెన్యూ అధికారులకు ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసే అధికారం లేదని ఈ మేరకు వారు స్పష్టం చేశారు.

వైద్యుల సమ్మెబాట

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిలిచిన వైద్య సేవలు



డిమాండ్లు నెరవేర్చాలని నినదిస్తున్న వైద్యులు



పార్వతీపురం కలెక్టరేట్ వద్ద వైద్యుల నిరసన

సాక్షి, పార్వతీపురం మన్యం: వైద్యులు సమ్మె సైరన్ మోగించారు. తమ సమస్యలు, డిమాండ్ల పరిష్కారంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా విధులను బహిష్కరించారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులందరూ సమ్మె బాట పట్టారు. ఓపీ, అత్యవసర సేవలు కూడా నిలిపి వేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినా.. మరో చోట నుంచి వైద్యులను డిప్యుటేషన్ మీద పంపినా.. ఫలితం లేకపోయింది. జిల్లాలో పల్లె వైద్యం పూర్తిగా పడకేసింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గత నెల 26 నుంచి నిరసనలు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు పీజీ కోటా పెంచాలని, ఏజెన్సీ అలవెన్సులు ఇవ్వాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని పీహెచ్‌సీ వైద్యులు డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. ఆ మేరకు గత నెల 26 నుంచి వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల డిమాండ్ల పట్ల కూటమి ప్రభుత్వం నుంచి సానుకూలత లేకపోవడంతో బుధవారం పూర్తిగా విధులను బహిష్కరించారు. కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. గురువారం విజయవాడ బయలుదేరి వెళ్తున్నారు. అక్కడే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారు.

వైద్య సేవలకు ఆటంకం

మన్యం జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ పని చేస్తున్న వైద్యాధికారులు సమ్మెబాట పట్టడంతో ఆయా గ్రామాల్లో వైద్య సేవలకు ఆటంకం ఏర్పడింది. జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. విజయనగరం, పార్వతీపురం జిల్లాల నుంచి ప్రభుత్వ వైద్య కళాశాల, ఆయుష్, ఇతర విభాగాల నుంచి 35 మంది వైద్యులను డిప్యూటేషన్ మీద నియమించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 24 గంటలూ సిబ్బందిని అక్కడ అందుబాటులో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తిగా విఫలమయ్యాయి. పీహెచ్‌సీలు పూర్తిస్థాయి సేవలు అందించలేకపోతున్నాయి. ప్రత్యామ్నాయంగా పంపిన వైద్యులు కొన్ని పీహెచ్‌సీలకు మాత్రమే హాజరై, అక్కడ కూడా కేవలం 30 నిమిషాలు మాత్రమే ఉండి వెళ్లిపోయారు. దీంతో ఎక్కడ చూసినా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి.

గతేడాది నుంచి పోరాటం చేస్తున్నాం



మా డిమాండ్ల పరిష్కారం కోసం గత ఏడాది కూడా పోరాటం చేశాం. ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. టైం బాండ్ ప్రమోషన్లు, పీజీ కోటా వెయిటేజీ పెంచాలన్న ప్రధాన డిమాండ్లతో సమ్మె చేస్తున్నాం. ప్రభుత్వం దిగి వచ్చేవరకూ పోరాటం ఆపేది లేదు.
– డాక్టర్ చాందిని, కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

శాంతియుతంగానే కష్టాన్ని చెప్పుకుంటున్నాం



మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్నాం. మాకు ఇస్తామన్న ఎటువంటి అలవెన్సులూ ఇవ్వడం లేదు. ప్రమోషన్లలోనూ నష్టపోతున్నాం. ఏడాదిగా చూస్తాం, చేస్తాం అంటున్నారు. మా కష్టాన్ని శాంతియుతంగానే ప్రభుత్వానికి చెప్పుకుంటున్నాం. న్యాయం చేస్తారని భావిస్తున్నాం.
– డాక్టర్ స్వాతి, గుమ్మలక్ష్మీపురం ఆరోగ్య కేంద్రం

కాలయాపన చేస్తున్నారు..



మా డిమాండ్లను పరిష్కరిస్తామని గత ఏడాది మాట ఇచ్చారు. ఇప్పటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఇన్ సర్వీసు కోటాను 30 నుంచి 15 శాతానికి తగ్గించారు. దానిని పునరుద్ధరించాలి. అలవెన్సులు పెండింగులో ఉంచారు. గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్నా.. ప్రత్యేక అలవెన్సులు ఏమీ లేవు. ప్రమోషన్లు కూడా లేక నష్టపోతున్నాం.
– డాక్టర్ అజయ్, తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..



ఏడాది కాలంగా ఎన్నోసార్లు ప్రభుత్వానికి, అధికారులకు మా డిమాండ్లను వివరించాం. స్పందించడం లేదు. పీజీ కోటా, ప్రమోషన్లు, సంచార చికిత్స, గిరిజన ప్రాంత అలవెన్సులు అడుగుతున్నాం. ఏ ఒక్క విషయంలోనూ ప్రభుత్వం నుంచి సానుకూలత రావడం లేదు. ఈ నేపథ్యంలో గత నెల 26 నుంచి వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నాం. శుక్రవారం నుంచి విజయవాడలో దీక్షలు చేపడతాం.
– డాక్టర్ వినోద్ కుమార్, ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి


వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



రామతీర్థంలో పల్లకిలో శ్రీవారి తిరువీధి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేకువజామున ప్రాతఃకాలార్చన పూజలనంతరం యాగశాలలో విశేష హోమాలను అర్చకులు జరిపించారు. శ్రీవారి తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో ఆశీనులు చేసి రామతీర్థం పురవీధుల్లో మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేశారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం యాగశాలలో పూర్ణాహుతి, అవబృదం కార్యక్రమా లను జరిపిస్తామని అర్చకులు తెలిపారు. అనంతరం భాస్కర పుష్కరిణిలో శ్రీవారికి చక్రతీర్థ స్నానం కనుల పండువగా చేయిస్తామన్నారు. 3న జరిగే పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, రామగోపాలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

'మడ్డువలస'కు వరద పోటు



నాలుగు గేట్ల నుంచి కిందకు విడిచిపెట్టిన నీరు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టుకు బుధవారం వరద ప్రవాహం పెరిగింది. వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి 10,500 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద 64.28 మీటర్ల మేర నీటిమట్టం నమోదైంది. బుధవారం నాలుగు గేట్లు ఎత్తివేసి 11వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెట్టినట్టు ఏఈ నితిన్ తెలిపారు.





క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యవర్గం ఏర్పాటు



సాఫ్ట్‌బాల్ కార్యవర్గం

బొబ్బిలి: సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పరిశీలకులు ఎంవీ రమణ, తిరుపతిరావుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎమ్మెల్యే బేబీనాయన, ఐ.విజయకుమార్, కోశాధికారిగా ఎస్.వెంకటినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సుంకరి సాయిరమేష్‌లను ఎన్నుకున్నారు.

డివైడర్‌ను ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి జాతీయ రహదారిపై డివైడర్‌ను బైక్‌తో ఢీకొన్న భార్యాభర్తలు గాయాలపాలయ్యారు. బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళానికి చెందిన భార్యాభర్తలు బైక్‌పై విశాఖపట్నం బయల్దేరారు. మార్గం మధ్యలో పోలిపల్లి చేరుకుసరికి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న భర్తకు తీవ్రగాయాలు కాగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ మహిళా ఉద్యోగులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలలో భాగంగా బుధవారం సంస్థ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వరంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా సంస్థ డీజీఎం దాలినాయుడు మాట్లాడుతూ హుద్‌హుద్ వంటి తుఫాన్‌లు, విపత్కర పరిస్థితుల్లో కేవలం బీఎస్ఎన్ఎల్ మాత్రమే అందరికీ అందుబాటులో నిలిచి అందరి మన్ననలు పొందిందన్నారు. 25 ఏళ్ల ఉత్సవాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండేవిధంగా ఫోర్‌జీ నెట్‌వర్క్, 100జీబీ స్పీడ్‌తో ఇంటర్‌నెట్ సదుపాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సైతం కొత్తగా టవర్ల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ ర్యాలీ ప్రారంభించి టీటీడీ కల్యాణ మంటపం, లయన్స్ క్లబ్, కోట జంక్షన్, గురజాడ అప్పారావు రోడ్డు మీదుగా తిరిగి కార్యాలయానికి ర్యాలీ చేరింది.

చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువులో పడి మృతి చెందిన గౌరీ శంకర్రావు

పార్వతీపురం రూరల్: మండలంలోని ఎమ్మార్ నగరం సమీపంలో గల చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన వి.గౌరీశంకర్రావు (31) మృతి చెందినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతుడు గౌరీశంకరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్సై, బంధువులు చెప్పారు.

రూటు మార్చిన ఏనుగులు

భామిని: మండలంలోని ఇసుకగూడ–సన్నాయిగూడ సమీపంలోని మెట్టపై మకాం వేసిన ఏనుగుల గుంపు బుధవారం రూటు మార్చింది. దిమ్మిడిజోల–లోవగూడల వైపు నాలుగు ఏనుగుల గుంపు పయనం ఆరంభించింది. దీంతో భామిని వైపు గల గ్రామాల రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే పొలాల్లో పంటలు నిండుగా ఉన్న తరుణంలో ఏనుగులు చేపట్టనున్న పంటల విధ్వంసంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

అర్చకుల ఆర్తనాదం..!

- న్యాయం చేయాలంటూ వేడుకోలు
- దేవదాయ శాఖ భూమిని ఆక్రమించిన టీడీపీ నేత
- పార్టీలకు అతీతంగా గ్రామంలో నిరసన
- పోలీసులు, రెవెన్యూ, దేవదాయ శాఖలకు ఫిర్యాదు



ఆక్రమించిన భూమిని చూపుతున్న గ్రామస్తులు, చిత్రంలో నేలపై దేవాదాయశాఖ బోర్డు

వంగర: మండల పరిధిలోని సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి దేవాలయం పరిధిలో దేవదాయ శాఖ భూమిపై టీడీపీ నేత కన్ను పడింది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇంకెవ్వరు అడ్డు అంటూ గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు సుమారు 80 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నాడు. దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన బోర్డును సైతం లెక్క చేయకుండా భూమిని ఆక్రమించేశాడు. కొన్ని దశాబ్దాలుగా సంగమేశ్వరస్వామి దేవాలయం పురోహితులు(అర్చకులు)గా ఉంటున్న సిద్ధాంతం చిన్నిస్వామి, సిద్ధాంతం పోలిలింగం, సిద్ధాంతం విశ్వనాథం, సిద్ధాంతం నాగభూషణరావులు ఆ భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని నెలల క్రితం ఈ భూమిని గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు ఆక్రమించుకోవడంతో దేవాదాయ శాఖ ఈవో పొన్నాడ శ్యామలరావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సిద్ధాంతం గణపతిరావు ఆధ్వర్యంలో అర్చకుల బృందం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. అయితే ఆ భూమి వదిలేందుకు ఆక్రమణదారు ముందుకు రాకపోవడంతో బుధవారం గ్రామంలోని ప్రజలంతా పార్టీలకు అతీతంగా ఐక్యమై నిరసన తెలిపారు. ఆక్రమించుకున్న భూమి వద్దకు వెళ్లి కొన్ని దశాబ్దాల నుంచి సంగమేశ్వరస్వామి ఆలయ పురోహితులు అనుభవించే వారని, ఇప్పుడు ఈ భూమి ఎలా దఖలుపడిందని ఆక్రమణదారును ప్రశ్నించారు. అనంతరం గ్రామంలో తిరుగాడుతూ దేవాదాయ శాఖ భూములను రక్షించాలంటూ నినాదాలు చేశారు.



నినాదాలు చేస్తున్న ఇరుపార్టీలకు చెందిన ప్రజలు

దశాబ్దాల నుంచి పురోహితుల ఆధీనంలో..



దశాబ్దాల తరబడి సంగమేశ్వరస్వామి దేవాలయం పురోహితం చేస్తూ సర్వే నంబర్6–3లో 80 సెంట్ల భూమిని నాలుగు కుటుంబాల వారం సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు ఆ భూమి తనకు చెందినదని బెదిరించి ఆక్రమించుకున్నాడు.

సిద్ధాంతం చిన్నిబాబు, అర్చకుడు, సంగాం

ఆక్రమించుకోవడం అన్యాయం..



దేవాదాయ శాఖకు చెందిన భూమిని పురోహితం చేస్తూ మా కుటుంబసభ్యులం అనుభవిస్తున్నాం. అప్పట్లో దేవాదాయ శాఖకు శిస్తు కూడా చెల్లించాం. ఇప్పుడు ఈ భూమిని ఆక్రమించుకోవడం అన్యాయం. మాకు న్యాయం చేయాలి.

సిద్ధాంతం పోలిలింగం, అర్చకుడు, సంగాం

పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించాలి..



అన్యాయంగా భూమిని అక్రమించుకున్న వ్యక్తిపై పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలి. ఆక్రమణదారు వద్ద ఎటువంటి ఆధారం లేకుండా పురోహితులు చేస్తున్న భూమిని అన్యాయంగా ఆక్రమించుకున్నారు.

సిద్ధాంతం గణపతి, ప్రధాన అర్చకుడు, సంగాం

దౌర్జన్యంగా ఆక్రమణ..



దేవాదాయ శాఖకు చెందిన భూమిని టీడీపీ నేత దారుణంగా ఆక్రమించకున్నాడు. దశాబ్దాల కాలం నుంచి ఈ భూమి సంగమేశ్వరస్వామి ఆలయం పురోహితులు సాగుచేసుకుంటున్నారు. ఆ భూమి ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. అటువంటి భూమిని ఆక్రమించుకోవడం దారుణం. దర్యాప్తు చేసి దేవాదాయ శాఖ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

గేదెల రామకృష్ణ, గ్రామపెద్ద, సంగాం

పోలీసులకు ఫిర్యాదు చేశాం..

సంగమేశ్వరస్వామి ఆలయం పరిధిలో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన సర్వే నంబర్ 6–3లో 80 సెంట్ల భూమి గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు ఆక్రమించుకున్నట్లు వంగర పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇటు రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేశాం. భూమి ఆక్రమణ వాస్తవమే.

పొన్నాడ శ్యామలరావు, ఈవో, సంగాం

పైడితల్లి అమ్మవారి ప్రసాదాల నాణ్యత పరిశీలన



ప్రసాదాల తయారీకి వాడే ఆహార పదార్థాల రా మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతరకు వినియోగిస్తున్న ప్రసాదాల నాణ్యత తీరును ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి మాట్లాడుతూ అమ్మవారి పండగకు సంబంధించి తయారు చేసే లడ్డు, పులిహోర ప్రసాదాలకు సంబంధించిన ఆహారపదార్థాల నాణ్యతను ప్రతిరోజూ చెక్ చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించామని, వాటిని హైదరాబాద్‌లోని నాచారంలో ఉన్న ఫుడ్ లేబొరేటరీకి పంపిస్తామన్నారు. ప్రసాదాలకు వినియోగించే కందిపప్పు, శనగపప్పు, కాజూ, నెయ్యి తదితర వాటిని చెక్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ మీరా, ఆలయ సూపర్‌వైజర్ రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లేటెస్ట్ టెక్నాలజీని వినియోగించాలి

- ఎస్పీ దామోదర్



పెదమానాపురం పీఎస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: స్మార్ట్ పోలీసింగ్ ప్రతి పోలీస్ స్టేషన్ లో ఉండాలని ఎస్పీ దామోదర్ అన్నారు. సీఎం చంద్రబాబు పర్యటన బుధవారం ముగిసిన వెంటనే పెదమానాపురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషను పరిసరాలు పరిశీలించి, స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. స్టేషన్ కు వచ్చే బాధితులు, వృద్ధులు, మహిళల పట్ల అప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులపట్ల సామరస్యంగా, నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందిని, అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలందించాలని, అందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడే వారిని, గంజాయి, మహిళలు పట్ల దాడులకు పాల్పడే వారిని, బాలలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.

మహిళల ఆర్థికస్వావలంబన పెంపుదలే లక్ష్యం

- సెర్ప్ సీఈఓ కరుణ



డ్వాక్రా, సరస్ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారిణి వాకాటి కరుణ

విజయనగరం టౌన్: మహిళల్లో ఆర్థికస్వావలంబన పెంపొందించడమే లక్ష్యంగా అఖిలభారత డ్వాక్రా బజార్, సరస్‌ను ఏర్పాటుచేశామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వాకాటి కరుణ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన డ్వాక్రాబజార్, సరస్ ఎగ్జిబిషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్వయం సహాయక సంఘ సభ్యులు ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించి, వారితో మమేకమయ్యారు. మహిళల సృజనాత్మకత, శ్రమ, నైపుణ్యాలను ప్రోత్సహించే దిశగా ఇటువంటి కార్యక్రమాలు రూపకల్పన చేశామన్నారు. ఎన్నోరకాల తయారీ ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉంచడం అభినందనీయని ప్రశంసించారు. కార్యక్రమంలో సెర్ప్ హెచ్‌ఆర్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, వెలుగు ఏపీడీ సావిత్రి, పీడీ రత్నాకర్, సరస్ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, డీపీఎంలు రాజ్‌కుమార్, చిరంజీవి, లక్ష్మునాయుడు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వేగావతి నదిలో భవానీ భక్తుడు గల్లంతు



యోగీశ్వర్రావు (ఫైల్)



మృతదేహం కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని జె.రంగరాయపురం వద్ద వేగావతి నదిలో స్నానానికి దిగిన పాటోజు యోగీశ్వర్రావు(22) అనే భవాని భక్తుడు బుధవారం గల్లంతయ్యాడు. బొబ్బిలి పట్టణంలోని కంచరవీధికి చెందిన యోగీశ్వర్రావు సహచర ఐదుగురు భవానీ భక్తులతో కలిసి బుధవారం వేగావతి నదిలో స్నానమాచరించేందుకు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దిగారు. నదిలో నీటి ప్రవాహ ఉధృతి ఒక్కసారిగా పెరిగిపోవడంతో ప్రమాదవశాత్తు ముగ్గురు భక్తులు కొట్టుకుపోగా వారిలో వినయ్, చరణ్‌లు చెట్లపొదల్లో చిక్కుకుని ప్రాణాలతో క్షేమంగా బయటపడగా, యోగీశ్వర్రావు నదిలో కొట్టుకుపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్సై కొండల రావు, ఫైర్ స్టేషన్ హెచ్‌సీబాలకృష్ణ ఆధ్వర్యంలో నలుగురు ఫైర్ సిబ్బంది నదిలో తాళ్లసహాయంతో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా మృతదేహం లభ్యం కాలేదు. యోగీశ్వర్రావు పట్టణంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తు కుటుంబానికి అండగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వీరాచారి, సుజాత, తమ్ముడు శ్యాంలు నదివద్దకు చేరుకుని బావురుమాన్నారు. మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఏఎస్సై కొండలరావు విలేకరులకు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతిచెందిన పైడితల్లి

విజయనగరం క్రైమ్: నగరంలోని హుకుంపేటకు చెందిన పైడితల్లి(50) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు విజయనగరం టూటౌన్ ఏఎస్సై రామారావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పైడితల్లికి ఇద్దరు భార్యలు. మొదటి భార్యతో విడాకులు తీసుకుని రెండో భార్యతో నివసిస్తున్నాడు. సైకిల్ టైర్ పంక్చర్ రిపేర్ తో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజులాగానే పనిలోకి వెళ్లిన పైడితల్లికి అక్కడే కరెంట్ షాక్ తగలడంతో మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య మంగ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేబిస్ వ్యాధితో వ్యక్తి మృతి

- భయభ్రాంతులకు గురవుతున్న గ్రామస్తులు
- కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



లింగంనాయుడు(ఫైల్)

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన అదపాక లింగంనాయుడు(37) రేబిస్ వ్యాధితో సోమవారం మృతిచెందాడు. ఆయనకు ఆగస్టు 30న కుక్క కరవడంతో సంతకవిటి పీహెచ్‌సీకి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకున్నాడు. ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో శనివారం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లగా రేబిస్ వ్యాధి సోకినట్లు వైద్యులు గుర్తించి, మెరుగైన చికిత్స కోసం వైజాగ్ రిఫర్ చేయడంతో ఆదివారం వైజాగ్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన మృతితో గ్రామస్తులు భయాందోళన చెంది గ్రామంలో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూముల రీసర్వేకు సర్వం సిద్ధం

- అక్టోబర్ 3 నుంచి 43 గ్రామాల్లో ప్రారంభం
- జేసీ సి.యశ్వంత్ కూమర్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న భూముల రీసర్వేకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అక్టోబర్ 3వ తేదీ నుంచి తొలి విడతలో 43 గ్రామాల్లో ఈ బృహత్తర కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 175 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, క్షేత్రస్థాయి సర్వే పనులను 60 రోజుల్లో ముగించేందుకు వివిధ సర్వే బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, రైతులకు అత్యంత ప్రయోజనకరంగా మార్చేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రామ సర్వేయర్, వీఆర్‌ఓలు ఒక బృందంగా ఏర్పడి రైతులకు సమాచారాన్ని చేరవేస్తారని, సర్వే నంబర్ల వారీగా రోజువారీ షెడ్యూల్‌ను ముందుగానే రూపొందించి, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించడంతో పాటు, వాట్సాప్ గ్రూపులు, టామ్–టామ్ వంటి మాధ్యమాల ద్వారా ప్రతి భూ యజమానికి తెలియజేస్తారన్నారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించి, రీసర్వే ఉద్దేశం, ప్రయోజనాలను రైతులకు క్షుణ్ణంగా వివరిస్తారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన (గ్రౌండ్ ట్రూథింగ్) పూర్తయ్యేలోపే అన్ని రకాల మ్యుటేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తారని చెప్పారు. సర్వే అనంతరం భూయజమానుల విస్తీర్ణ వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే అక్కడికక్కడే స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ చారిత్రాత్మక అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకుని, తమ భూ రికార్డులను సరిచూసుకోవాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు.

జీఎస్టీపై అవగాహన

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బుధవారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతం వరకు తగ్గించడం వల్ల ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, డిష్ వాషర్లు వంటి 375 వస్తువులు మరింత తక్కువ ధరకు లభిస్తాయన్నారు.

అడ్మిషన్లకు 'పెన్' చాలు



విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎస్. ప్రభాకర రెడ్డి

- కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఉన్నత విద్య అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేస్తూ కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. డిగ్రీ వంటి కోర్సుల్లో చేరేందుకు ఇకపై విద్యార్థులు ఎలాంటి సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం లేదని, కేవలం అపార్ ఐడీ, పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) ఉంటే సరిపోతుందని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఏ ఒక్క విద్యార్థి డిగ్రీకి దూరం కాకూడదన్నారు. బడి మానేసిన, 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి చేర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, గార్మెంట్ టెక్నాలజీలో శిక్షణతో పాటు, ప్రతిరోజూ యోగా, హెచ్‌బీ స్థాయి పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలైన చదవడం, రాయడం తప్పనిసరిగా వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈఓ రాజకుమార్, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతన్నకు జీఎస్టీ 2.0తో ఊరట

వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) 2.0సంస్కరణలు రైతాంగానికి ఎంతో మేలు చేకూర్చనున్నాయని కలెక్టర్ డా.ఎస్. ప్రభాకర రెడ్డి అన్నారు. ఈ పన్ను తగ్గింపు ప్రయోజనాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌తో కలిసి జీఎస్టీ 2.0 అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

Join B.Sc Ai / CSc over 60%, Maths in 10+2 get 5000 fee discount Join M.Com/ MA Eng/MSW by 6/10, 3000 fee dis, 9177408565 [SCA25008618]

PLOT FOR SALE

90 Vuda బిట్ (గేటెడ్ కమ్యూనిటీ) అచ్యుతపురం అమ్మబడును. సంప్రదించండి. 9652516920 [SCA25008615]

WANTED

కేర్ టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో ప్రముఖ హోమ్‌కేర్ ఆఫీస్ కి ఇంటి వద్దనే ఉండి పెద్దవారిని చూసుకొనుటకు అనుభవంగల స్టాఫ్ కావలెను. ✆ 916083 5559, 99121 15559 [B-279]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏనుగులు ధ్వంసం చేసిన పంట పరిహారం కోసం ఆందోళన



కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: ఏనుగుల గుంపు సృష్టిస్తున్న బీభత్సానికి తమ పంటలు సర్వనాశనమయ్యాయని, తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, గిరిజన సంక్షేమ సంఘం నేతృత్వంలో బుధవారం నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కేవలం 5 కిలోమీటర్ల దూరంలోని మరికి, కృష్ణపల్లి తదితర గ్రామాల సమీపంలో 8 రోజులుగా ఏనుగులు సంచరిస్తూ సుమారు 50 ఎకరాల్లో మొక్కజొన్న, వరి, టేకు చెట్లను ధ్వంసం చేశాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనీసం నష్టాన్ని అంచనా వేయడానికి కూడా రాలేదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా సభ్యుడు పి. సంగం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన నష్టానికి ఇప్పటికీ పరిహారం చెల్లించలేదని, అరకొర సాయం అందించి అధికారులు చేతులుదులుపుకుంటున్నారని, పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి న్యాయమైన పరిహారం చెల్లించాలని, అలాగే ఏనుగులను సురక్షిత ప్రాంతాలకు తరలించి రైతులు, ప్రజల ప్రాణాలకు, పంటలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఏనుగులు సంచరిస్తున్న గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారాన్ని త్వరగా అందించేలా చర్యలు



మొక్కజొన్న రైతులు, సీపీఐ, గిరిజన సంఘం నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి

ఏనుగులు ధ్వంసం చేసిన పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని సత్వరమే అందజేయాలని కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి డీఎఫ్ఓ జీఏపీ ప్రసూనను ఆదేశించారు. పార్వతీపురం మండలం మరికి, కృష్ణపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఏనుగుల గుంపు తమ పంట పొలాల్లోకి చొరబడి తాము సాగుచేసుకుంటున్న పంటలను ధ్వంసం చేస్తున్నాయని బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కావున నష్టపోయిన పంటలకు గాను సంబంధిత రైతులు, కౌలు రైతులకు తగిన నష్టపరిహారాన్ని అందించి తమను ఆదుకోవాలని కలెక్టరుకు దరఖాస్తు అందజేశారు. ఈ దరఖాస్తు పరిశీలించిన కలెక్టర్ వెంటనే స్పందించి, జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందజేయాలని, అలాగే నష్టపోయిన గిరిజన రైతులకు త్వరగా నష్టపరిహారం అందించే దిశగా సత్వర చర్యలు చేపట్టాలని డీఎఫ్ఓ జీఏపీ పి.ప్రసూనను ఆదేశించారు. దీంతో రైతులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

